

వెండి పతకం గ్రహీతకు అభినందన



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం కలెక్టరేట్ : ఇటీవల పాన్ ఇండియా అథ్లెటిక్ మీట్ రన్నింగ్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించిన ఇరిగేషన్ శాఖ శ్రీనివాస్ యాదవ్‌కు పిటిసి స్టేడియం వాటకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం పిటిసి మైదానంలో నిర్వహించిన సన్మాన సభకు వాకర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రమోహన్ రెడ్డి, పిటిసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ బాబు మాజరై మాట్లాడుతూ శ్రీనివాస్ యాదవ్ పాన్ ఇండియా అథ్లెటిక్ మీట్ హైదరాబాద్‌లో 5 కిలోమీటర్ల వాకింగ్, 3 కిలోమీటర్ల రన్నింగ్‌లో జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్, బ్రాంచ్ మెడల్ సాధించాడన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి హాజరై శాలువాతో సన్మానించి అభినందలు తెలిపారు.

ఎవరి అంచనాలు వారివి...

సామాజిక తరగతుల వారీగా లెక్కలు

కులాల వారీగా బేరీజులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు మే 13న పూర్తయ్యాయి. అప్పటి నుంచి అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. తాము విజయం సాధిస్తామంటే.. తామే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే లోలోనా మాత్రం విజయావకాశాలపైన గుబులు మాత్రం వీడటం లేదు. సామాజిక తరగతులు, కులాల వారీగానూ లెక్కలు వేసుకుంటున్నారు. దీనిపై పందాలు కూడా కాస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అన్ని చోట్ల ప్రధాన పోటీ వైసిపి, టిడిపిల మధ్యనే ఉంది. అయితే ఈ ఎన్నికల్లో ఎన్ని స్థానాల్లో వైసిపి గెలుపొందుతుంది...ఎన్నింటిలో టిడిపి విజయం సాధిస్తుందన్న లెక్కలేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్టీలకు తగినంత బలముంది. అయితే 2014, 2019 ఎన్నికల్లోనే ఫలితాలు పూర్తిగా వన్‌సైడ్ వచ్చాయి. అంతక మునుపు టిడిపి ఆవిర్భావ సమయంలో మాత్రమే ఈ రకమైన ఫలితాలొచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. 2014కు ముందు వరకు జరిగిన ఎన్నికల్లో ప్రధానంగా అధికార పార్టీకి ఎనిమిది, ప్రతిపక్ష పార్టీకి ఆరు వరకు స్థానాలొస్తూ ఉండటమే అధికంగా జరుగుతూ వచ్చింది. కాని 2014 నుంచి జిల్లాలో ట్రెండ్ మారింది. ఒకవైపే ఫలితాలొస్తున్నాయి. ఈసారి ఫలితాలు ఏ రకంగా ఉండనున్నాయన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.. ఈసారి ఫలితాలు ఏకపక్షంగా ఉండనున్నాయా లేక మిశ్రమంగా వస్తాయా అన్నది చర్చ నడుస్తోంది. అయితే ఫలితాలు వన్‌సైడ్‌ఉంటాయని తాజా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ, రాప్తాడు తాజా, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. టిడిపి నాయకులు కూడా ముందు నుంచి ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు. ఏది ఏమైనా ఈసారి ఓటర్ల మనోగతం గుర్తించడం నేతలకే కాకుండా విశ్లేషకులకు కూడా అంతుబట్టకుండా ఉంది. సామాజికవర్గాల వారీగా చూసినప్పుడు ఉద్యోగులు, యువత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారన్న చర్చ నడుస్తుండగా, మహిళలు, గ్రామీణ ప్రాంతంలో అధికారపార్టీకి అనుకూలంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇకపోతే ఉమ్మడి జిల్లాలో మైనార్టీలు మున్సిపల్ పట్టణాల్లో ప్రభావం చూపేంత సంఖ్య ఉంది. ముస్లిములు ఈసారి కాంగ్రెసు వైపు కొద్దిగా మొగ్గుచూపినట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఓట్లు ఏ మేరకు అటు మళ్లాయన్నది గుర్తించలేకుండా ఉన్నట్టు నేతలు చెబుతున్నారు. ఈ ఓట్లు ఎన్ని మార్పు జరిగుంటే దాన్ని బట్టి వచ్చే ఫలితాలలపైనా ప్రభావం ఉండే అవకాశాలు కొన్ని నియోజకవర్గాల్లో ఉన్నాయి. ఇలా సామాజిక తరగతులు, కులాల వారీగా లెక్కలు తీసుకుని తమకు అనులకూలమంటే...తమకు అనుకూలంగా ఉంటాయని నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. ఈ అంచనాలు తేలే సమయం కూడా దగ్గరపడుతుండటంంతో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఓట్ల లెక్కింపునకు సరిగ్గా పదిరోజుల సమయం ఉంది. సమయం దగ్గరపడుతున్న కొద్ది సర్వత్రా ఉత్కంఠత పెరుగుతూపోతోంది.

'అనంత'లో వ్యక్తి దారుణహత్య



హత్యకు గురైన జయపాల్‌నాయక్

అనంతపురం క్రైం : నగరంలోని 2వ రోడ్డు ఫ్లైఓవర్ కింద ఆదివారం ఉదయం ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. త్రీటౌన్ సీఐ ధరణీ కిషోర్ తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం మండలం వర్లి గ్రామానికి చెందిన జయపాల్‌నాయక్ స్థానిక రహమత్ నగర్‌లో నివాసం ఉంటూ కిరాణా సరుకుల గోడౌన్‌లో కూలీగా పని చేస్తున్నాడు. అయితే వర్లి గ్రామానికే చెందిన శ్రీనివాస్‌నాయక్ 3వ రోడ్డులో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో జయపాల్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ భార్యతో సన్నిహితంగా మెలిగేవాడు. దీంతో ఇద్దరికీ వివాహేతర సంబంధం ఉందని శ్రీనివాస్ నాయక్ అనుమానంతో సంవత్సరం క్రితం ఇద్దరూ గొడవపడి దూరంగా ఉంటున్నారు. అయితే ఇటీవల కాలంలో తిరిగి తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని భావించిన శ్రీనివాస్‌నాయక్, జయపాల్‌నాయక్‌పై ద్వేషం పెంచుకుని ఎలాగైనా చంపాలని తీర్మాని ంచుకున్నాడు. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం జయపాల్‌నాయక్ తన ఇంటి ముందు నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా శ్రీనివాస్‌నాయక్ ఆటోలో అనుసరించాడు. 2వ రోడ్డు ఫ్లైఓవర్ కిందకు రాగానే ఆటోతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో కింద పడిన జయపాల్‌నాయక్ తలపై సిమెంట్ రాయి వేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుని కోసం గాలిస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

- కలెక్టర్ ఇచ్చిన హామీ అమలు కాకపోతే ఉద్యమిస్తాం
- కార్మికులపై అక్రమ కేసులు ఎత్తివేయాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం స్థానిక జెవివి జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరువు జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రజల జీవనాధారంగా నిలిచిందన్నారు. 650 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తూ 600 మంది కార్మికులు వచ్చే వేతనాల్లో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. 15 ఏళ్లుగా కార్మికులు పనిచేస్తున్నప్పటికి వేతనాలు పెంపుదల జరగడం లేదన్నారు. మూడు ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపుదల చేయాల్సి ఉన్నా చేయడం లేదన్నారు. పైగా చేసిన పనికి వేతనాలు పొందాలంటే ప్రతి నెలా రోడ్లెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్మికుల మీద కమీషన్‌ల కోసం పని చేస్తున్న కాంట్రాక్టర్‌లు, హక్కులు కాపాడాల్సిన కార్మిక శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్మిక శాఖ పర్యవేక్షణ ఏమాత్రం లేదన్నారు. కాంట్రాక్టర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. వేతనాల కోసం వినతిపత్రాలు, నిరసనలు, ధర్నాలు చేసినా స్పందన రాకపోవడంతోనే కార్మికులు సమ్మెలు చేపడుతున్నారని తెలిపారు. సమ్మె నేపథ్యంలో అధికారులు హామీలిచ్చి కొంత మేరకు వేతనాలు ఇచ్చి సమ్మె విరమింపజేయడం, యధావిధిగా వేతనాలు బకాయిలు పడటం కార్మికులు రోడ్లు ఎక్కాల్సి రావడం తంతుగా మారిందని అన్నారు. ప్రభుత్వం ఒక రకంగా పొమ్మన లేక పొగ పెట్టే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. తాగునీటి పథకం ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగా రాబోయే రోజుల్లో నీటి కొళాయిలకు మీటర్లు అని అన్నారు. నిర్వహణ బాధ్యతలు అంగన్‌వాడీ ఏజెన్సీలకు అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకునేందుకు కుట్ర చేస్తోందన్నారు. తాగునీటికి సరఫరా పథకానికి నికర బడ్జెట్ కేటాయించడంలోనూ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే శ్రీరామిరెడ్డి పథకాన్ని ప్రభుత్వమే యధావిధిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. . బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ శివశంకర్‌పై చర్యలు తీసుకుని, కాంట్రాక్ట్ లైసెన్స్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కార్మికుల వేతనాల్లో రూ.2 వేలు కోత విధించిన కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డి నుంచి ఆ సొమ్మును తిరిగి కార్మికులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులపై బనాయించిన అక్రమ కేసులన్ని ఎత్తివేయాలన్నారు. కార్మికులను దూషిస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ శివ శంకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు మల్లికార్జున, ఏసురత్నం, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు ప్రజా, కార్మిక సంఘాలుగా ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. ఈ నెలలో నిరసన సమయంలో స్పందించిన కలెక్టర్ యూనియన్ నేత ఓబులుకు ఇచ్చిన హామీని నెలబెట్టుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఇది వరకు పని చేస్తున్న కార్మికులందరిని విధుల్లోకి తీసుకుని వేతనాలు చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెలోకి వెళ్లడం ఖాయమని యూనియన్ నాయకులు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించి పరిష్కరించేలా విజ్ఞాపన పత్రాలు అందజేద్దామని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, కోశాధికారి వన్నూరుస్వామి, మాజీ కార్యదర్శి గంగాధర, రామాంజినేయులు, నాగరాజు, నరేష్, రామాంజినేయులు, ఆదిరెడ్డి, సిఐటియు నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ఈ పండ్లు తింటే పడకే..!


- పక్వానికి రాకముందే రసాయనాలతో మగ్గిస్తున్న వైనం
- రంగు తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ప్రమాదం
- ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం
- అన్నీ తెలిసినా అందరిలోనూ ఉదాసీనతే



పట్టణంలో ఎటూ చూసినా మామిడి పండ్లు కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా నిగనిగలాడిపోతున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, కాస్త వెగటుగా ఉంటున్నాయి. పక్వానికి రాకముందే కాయల్ని కోసి, రసాయనాల వినియోగంతో వాటిని పండ్లుగా మార్చడం వల్ల కలిగే అనర్థానికి నిదర్శనమిది. మామిడి పండ్లు పూర్తిస్థాయిలో పక్వతతో పండితేనే మంచి రుచి ఉంటుందని తెలిసినా, వాటిని ముందుగానే కోసి, రసాయనాలతో పండించడం వల్ల రుచి ఉండదు సరికదా, ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్ట ప్రకారం నేరం కూడా. అయినా వ్యాపారులకు ఇవేవీ పట్టవు. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. అయితే ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఎకరాకు 15 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఐదు నుంచి ఏడు టన్నుల వరకు దిగుబడి తగ్గింది. స్థానికంగా అమ్మడంతో పాటు ఇక్కడి నుంచి కర్నాటక రాష్ట్రం బెంగళూరు, శ్రీనివాస పుర, బీజాపుర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం హైదరబాదు తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉంది. దీంతో ఎగుమతులు సైతం తగ్గాయి. ఉన్న మామిడిని ఎప్పటిలాగానే పక్వానికి రాక ముందే పంటను కోసేస్తున్నారు. వాటిని ఆకర్షణీయంగా పండించేందుకు నిషేధిత రసాయనాలన్నీ వినియోగిస్తున్నారు. కార్బైడ్ దొరకని పక్షంలో పొరుగు దేశాల నుంచి దిగుమతి అయిన పౌడర్లు, రసాయనాలతో మామిడిని మగ్గిస్తున్నారు. దీంతో అమృత ఫలాలు కాస్తా విష ఫలాలుగా మారిపోతున్నాయి. ఈ తరహాలో పండించిన మామిడి పండ్లను తినడం ద్వారా జీర్ణక్రియ, క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది రైతులు తమ ఇళ్లలోనే ఒక గదిలో మామిడి కాయలను ఉంచి కార్బైడ్, అగర బత్తి పొగ ద్వారా మగ్గిస్తారు. ఈ తరహాలో మామిడి కాయలను పండుగా తయారు చేయడం వల్ల త్వరగా పండు పక్వానికి వచ్చేయడం, తక్కువ ఖర్చుతో కూడుకోవడంతో అందరూ దీనినే అనుసరిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. దీనికి కనీసం 3 నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని అనుసరించి అధికారులు తనిఖీలు చేసి పక్వానికి రాక ముందే రసాయనాలతో మామిడిని పండిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికి అధికారులు ఎవరు ఆ మేరకు చర్యలు తీసుకోవటం లేదు. ముఖ్యంగా రైతులు పండించిన కాయలను పక్వానికి పచ్చినప్పుడే కోతకోయాలి. కోసిన కాయలను వారికి, అననుకూలంగా ఉన్నట్లయితే బోదగడ్డి, వరిగడ్డి లేకర్లుగా వేసి మాగించే విధానాలు పాటిస్తే మంచిది. రైతులకు అనుకూలంగా లేకపోతే కాయలను మగ్గించేందుకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు రైఫనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతపురం మార్కెట్ యార్డులో పండ్లు మగ్గించేందుకు మూడు ఛాంబర్స్ ఉన్నాయి కదిరి, గుత్తి, కళ్యాణదుర్గం, మార్కెట్ యార్డులలో ఒక్కొక్కటికిగా నిర్వహిస్తున్నారు ఈ విధానంతో పండ్లను మగ్గిస్తే ప్రజలకు ఆరోగ్య పరంగా సమస్యలు తలెత్తవు. రైతులు పండించిన ఉద్యాను త్పత్తులు మామిడితో పాటు సపోటా, అరటి, కర్బూజా, పైనాపిల్, బొప్పాయి వంటి వాటికి మగ్గించేదుకు ఈ కేంద్రాలను వినియోగిం చుకొనే అవకాశాలున్నాయి. కాయలను కోసినప్పుడే పక్వానికి వచ్చిన సమయంలో కోత కోసుకొనే విధంగా ఆ శాఖ అధికారులు సలహాలు ఇవ్వాలి.



మామిడి కాయలు మగ్గడానికి రసాయనక పౌడర్ ప్యాకెట్లు వేసిన దృశ్యం(వృత్తంలో)

ఈ పండ్లుతింటే రోగాలే..

కార్బేడ్స్, కార్బాక్సైడ్ తదితర రసాయనంతో మగ్గిస్తున్న పండ్లను తింటే క్యాన్సర్, మూత్రపిండ, జీర్ణకోశ తదితర వ్యాధుల బారిన పడతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవన్ని తెలిసినా కంటికి ఇంపుగా కనిపిస్తే చాలా కొనుక్కొని తింటున్నాము. తనిఖీ అధికారులు అడపా దడపా తనిఖీలు చేసి చేతులు దలుపుకుంటునే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. దీంతో హోల్‌సేల్ వ్యాపారుల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది.. ప్రజారోగ్యంతో చలగాటం ఆడుతున్న వ్యాపారుల మీద సరైన చర్యలు తీసుకోకపోవడంలో ఎవరెలా పోతే మాకెంటి, ఏదో కాలం వెల్లబుచ్చుతున్నామన్న చందంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కేసులు పెడితే వచ్చేలాభం ఏముందన్న ధోరణితో అధికారులు మామూళ్లు పుచ్చుకొని వెళుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

వ్యత్యాసం గుర్తించడం సులువే

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లను గుర్తించడంలో ఒక సులువైన మార్గం ఉంది. సహజంగా పండిన మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే పండు పెద్దది అయినప్పటికీ, బరువుతో ఉన్నా అది నీటిలో తేలుతుందని రైతులు అంటున్నారు. అంతే కాకుండా సహజంగా పండిన మామిడి పండు అయితే దాని బొడ్డు వద్ద వాసన చూస్తే రుచికరమైన వాసన వస్తుంది. అదే రసాయనంతో పండిస్తే అటువంటి సువాసన రాదు.

అధికారులు కేసులు పెట్టడం లేదు.....

రసాయనాలతో పండ్లను మాగించే వారిపై వ్యవసాయ, ఉద్యానవన శాఖాదికారులు, సీనియర్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు కేసులుపెట్టే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. రసాయనాల ద్వారా పండ్లు మగ్గిస్తే ఏడాది పాటు జైలుశిక్ష, రూ.5లక్షలు జరిమానా విధించే విదంగా వ్యవహరించాలని కోర్టు ఆదేశించింది. రెవెన్యూ, పోలీసులు సైతం పండ్లను రసాయనంతో మగ్గిస్తే కేసులు పెట్టవచ్చు. అయినప్పటికి ఆయా శాఖల మధ్య సమన్వయ లోపంతో, పండ్ల వ్యాపారులపై ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు అందరు కలిసి ఒక్క సారిగ పండ్ల వ్యాపారులపై తనిఖీలు ముమ్మరం చేస్తే పెద్ద మాఫియా బయట పడుతుంది.

ధర అధికమే

మార్కెట్‌లో మామిడి పండ్ల ధర కాస్త అధికంగానే ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా లభించే బేనిష మామిడిపళ్లు కిలో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. మల్లిక మామిడిపళ్లు కిలో రూ.100, మలగూబ కిలో రూ.120 నుంచి 150 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. రసపూరి మామిడిపళ్లు కిలో రూ. 110 నుంచి 130 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇతర జాతుల పండ్లు రూ.80 వరకు అమ్ముతున్నారు.

రసాయనాలతో మగ్గిస్తే దుష్పరిణామాలు



ప్రస్తుతం మార్కెట్లో నిగనిగలాడుతూ కనిపిస్తున్న మామిడి పండ్లు అన్ని పక్వానికి వచ్చి మగ్గినవి కాదు. పలు రకాల రసాయనాలు కలిపి మగ్గ బెడుతున్నారు. వీటివల్ల అనేక రకాలైన సమస్యలు తలెత్తుతాయి. గ్యాస్ట్రిక్, చర్మ సమస్యలు, ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోవడం, నరాలకు సంబంధించిన సమస్యలు సాధారణంగా వస్తుంటాయి. అదే పనిగా రసాయనాలతో మగ్గపెట్టిన మామిడి పండ్లను అధికంగా తింటే క్యాన్సర్, కిడ్నీ, లివర్ సమస్యలు వస్తాయి. రసాయనాలతో మగ్గపెట్టిన మామిడి పండ్లను తినకపోవడం చాలా మంచిది.

డాక్టర్ వెంకట రమణ నాయక్
ఫిజిషియన్, జిల్లా ప్రభుత్వ అసుపత్రి
హిందూపురం



అమ్మకానికి తోపుడు బండ్ల మీద సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

అల్లర్లకు పాల్పడితే చర్యలు

జిల్లావ్యాప్తంగా పోలీసుల కవాతు


కళ్యాణదుర్గం మండలంలోని గ్రామాల్లో తనిఖీలు చేపడుతున్న పోలీస్ అధికారులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం
సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో అరాచకాలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐలు హెచ్చరించారు. ఆదివారం కంబదూరు, కుందుర్పి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐలు చంద్రశేఖర్, నాగరాజు, హరినాథ్ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో బాణాసంచా పేలుడు, ఊరేగింపులు, తదితర కార్యకలాపాలను నిషేధించామన్నారు. ఏ పార్టీ గెలుపొందినా కార్యకర్తలు సమన్వయం పాటించాలని సూచించారు. గ్రామాలు, ఇళ్లు, గడ్డివాముల్లో మారణాయుధాలు పట్టుబడితే కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఆంజనేయులు, పరశురాం, సిబ్బంది పాల్గొన్నారు.


పుట్లూరు మండలంలో పోలీసుల కవాతు

వజ్రకరూరు : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్నేహభావంతోపాటు ఐకమత్యంగా కలిసిమెలిసి జీవించాలని ఉరవకొండ ఎస్ఐ రాఘవేంద్రప్ప సూచించారు. ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు ఆదివారం ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముష్టూరు, పెద్ద ముష్టూరు గ్రామాల్లో ఎస్ఐ రాఘవేంద్రప్ప ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్, గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జీవితాలను గడుపుకోవాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్‌కు ముందు, తర్వాత ప్రతి ఒక్కరూ కూడా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించరాదన్నారు. ఎన్నికలు ఐదేళ్లకోసారి వస్తాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలకు వెళ్లకూడదన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరికీ ఓ కుటుంబం ఉందన్న సంగతి మర్చిపోకూడదని గుర్తు చేశారు.


ఉరవకొండ మండలంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాఘవేంద్రప్ప

పుట్లూరు : మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. ఇందులో భాగంగా శనగలగూడూరు, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల, మడుగుపల్లి, ఓబుళాపురం, కడవకల్లు, కొండాపురం గ్రామాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ఫలితాల రోజు కూడా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏ పార్టీ గెలిచినా అందరూ సంయమనం పాటించి ఎలాంటి గొడవలు వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది, బలగాలు పాల్గొన్నారు.

బోరు విషయంలో గొడవ

రైతు అనుమానాస్పద మృతి

నిందితులు అరెస్టు : డీఎస్పీ



మృతిచెందిన నారాయణరెడ్డి, మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-నార్పల
మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొవ్వూరు లక్ష్మీనారాయణరెడ్డి (56) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఉదయం బోరు విషయంలో గొడవ జరిగిన నేపథ్యంలో మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే లక్ష్మీనారాయణరెడ్డిని హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతికి కారకులైన మంజుల రమణ, ఉదయ్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకట శివారెడ్డి తెలిపారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు.

జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి తన పొలంలో చీనీచెట్లు నాటాడు. అయితే పంటకు నీరు తక్కువ కావడంతో నాలుగు రోజుల క్రితం దుగుమర్రి చెరువులో బోరు వేశాడు. ఆదివారం ఉదయం మోటార్ బిగించుకుని పైప్‌లైన్ ద్వారా పంటకు నీరు పెట్టుకోవాలని పనులు చేసుకుంటున్నాడు. ఈ సమయంలోనే తుంపెర మిద్దెలకు చెందిన మంజుల రమణ, తదితరులు దుగుమర్రి చెరువులో బోరు ఎలా వేస్తావని ఘర్షణకు దిగారు. దీంతో తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ తోపులాటలో మోకాలికి గాయమై లక్ష్మీనారాయణరెడ్డి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు నార్పల ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో వైద్యశాల వద్దకు స్థానికులు భారీగా చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో హుటాహుటిన ప్రాథమిక వైద్యశాలకు చేరుకుని సీఐ శ్రీధర్‌కు సమాచారం అందజేశారు. తర్వాత నార్పలకు వచ్చిన సీఐ శ్రీధర్ లక్ష్మీనారాయణరెడ్డి మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం పెద్దాసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు కుళ్లాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

28 నుంచి ఎసిఎ సౌత్‌జోన్ అండర్-19 క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-అనంతపురం
ఎసిఎ సౌత్‌జోన్ అండర్-19 (వన్ డే) క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 28 నుంచి వచ్చేనెల 3వతేదీ వరకూ అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించనున్నట్లు ఎడిసిఎ కార్యదర్శి కె.మధు ఆచారి తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈమేరకు అనంత క్రీడామైదానంలో ఎ, బి గ్రౌండ్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎ, బి గ్రౌండ్ టర్ఫ్ పిచ్, అవుట్ ఫీల్డ్ టోర్నీకి సిద్ధం చేసినట్లు తెలిపారు.


ఎడిసిఎ జట్టు

ఎడిసిఎ జట్టు : కెహెచ్.వీరారెడ్డి (కెప్టెన్), టి.ప్రదీప్‌రెడ్డి (వైస్‌కెప్టెన్), బి.ప్రశాంత్ (డబ్ల్యుకె), ఎ.జయంత్‌కృష్ణ, ఎస్.అజాన్‌మహమ్మద్, సి.హర్షమర్ధన్, సిహెచ్.భార్గవ్‌రాజు, పి.మణిదీప్, ఎస్.కరీంబాబా, టిడి.ప్రతాప్‌రెడ్డి, శంకరనారాయణ, తస్వీర్‌జమాల్, ఎం.భువనేశ్వర్, నిశ్చయ్, పి.నీలేంద్ర, కె.వెంకట్ లోకేష్, ఎం.చెన్నకేశవరెడ్డి

స్టాండ్‌బైలు : ఎన్.మనోజ్‌కుమార్, సి.విఘ్నేష్ దినకర్, ఎం.చందు, టి.సందీప్‌రెడ్డి, మహమ్మద్ సాహిల్, కె.ప్రదీప్, త్రిభువన్,

కోచ్‌లు : కె.నరేష్, వి.అశోక్

సెలెక్టర్లు : ఎం.కమలాకర్‌నాయుడు, హెచ్.రవికాంత్ వ్యవహరిస్తారన్నారు.

కరిడికొండలో చిరుత సంచారం

భయాందోళనలో గ్రామస్తులు



చిరుత కోసం వెతుకుతున్న పోలీసులు, గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) చిరుత పాద ముద్రికలు

ప్రజాశక్తి-గుత్తి
మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో శనివారం రాత్రి చిరుత సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు వణికిపోతున్నారు. గ్రామ సమీపంలో కుక్కపై చిరుత దాడి చేసి నోట తీసుకెళ్తుండగా సాయిబాబా మెటల్ స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ద్విచక్ర వాహనంలో వెళ్తూ చూశారు. అయితే కేకలు పెట్టారు. గ్రామస్తులు కూడా పెద్దసంఖ్యలో కేకలు వేయడంతో చిరుత గ్రామం మధ్యలో ఉన్న కొండపైకి పరుగు తీసినట్లు గ్రామస్తులు చెప్పారు. సమాచారం తెలుసుకున్న అటవీ బీట్ అధికారి పి.రమేష్‌బాబు, సహాయ బీట్ అధికారి తిమ్మప్ప సిబ్బందితో కలిసి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం కూడా గాలింపు చర్యలు చేపట్టామని అటవీ బీట్ అధికారి పి.రమేష్‌బాబు తెలిపారు. చిరుత ఆచూకీ లభించలేదని ఆయన అన్నారు. గాలింపు చర్యలు కొనసాగిస్తామన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తున్న బలిజసంఘంన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం
రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ బలిజ మహాసంఘం శంకరయ్య మాట్లాడుతూ టెన్త్‌లో 550 మార్కులపైన సాధించిన 106మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశామన్నారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. తల్లిదండ్రులు మీకోసం చేస్తున్న కృషికి తగ్గట్టుగా ఫలితం ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, యూత్ అధ్యక్షులు రమేష్, ట్రెజరర్ కోనేటి సాయిప్రసాద్, పగడాల మల్లికార్జున, రమణ, సుబ్బు, పాముూరాయ్ వెంకటేష్, టమోటా కృష్ణమూర్తి, లక్ష్మీప్రసాద్, రామకృష్ణ, పెద్దన్న, రవికుమార్, రామచంద్ర, పవన్‌కుమార్, ఆదెన్న, రంగనాయకులు, దండు శ్రీనివాసులు, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇన్‌ఫినిటి స్కూల్ ప్రారంభం


ఇన్‌ఫినిటి స్కూల్ ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
అనంతపురం పట్టణం, ఆదర్శ్ నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు సువిశాలమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఇన్‌ఫినిటి స్కూల్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కరస్పాండెంట్ టి.లక్ష్మీదేవి, ఏ.మల్లికార్జునల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్‌ఫినిటి స్కూల్‌ను ఐఐటి మద్రాస్ యూనివర్శిటీ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ కె.తంగిరాల, జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ సి.శశిధర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎసిఆర్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అరుణ్ కె.తంగిరాల మాట్లాడుతూ ఐఐటి, జెఈఈ, నీట్ ఐ ఫౌండేషన్ స్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పిల్లలకు ఆట పాటలు ఆడించి చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ పాఠశాల చక్కటి వేదికగా నిలవబోతుందన్నారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ సువిశాలమైన వాతావరణంలో అధునాతన భవంతిలో చక్కటి స్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వాతావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ సమస్య లేని ప్రాంతంలో ఇన్‌ఫినిటి స్కూల్ ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కరస్పాండెంట్ టి.లక్ష్మీదేవి, ఏ.మల్లికార్జున మాట్లాడుతూ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు తల్లి తండ్రులు పాఠశాలలను సందర్శించి అడ్మిషన్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-బెలుగుప్ప
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా కొనసాగింది. ఇందులో భాగంగా తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఒకరినొకరి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వపు విద్యార్థులు భారీగా తరలిరావడంతో పాఠశాల ప్రాణాంగమంతా పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం అప్పటి గురువులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


శింగనమలలో పూర్వ విద్యార్థులు

శింగనమల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2004-05లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన లక్ష్మిరెడ్డి (గణితం), చంద్రశేఖర్ (తెలుగు), దివాకర్‌రెడ్డి (సోషియల్), వెంకటప్రసాద్ (సైన్స్)ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అప్పట్లో పాఠశాల జీవనాన్ని మరోసారి గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం పాఠశాలకు తమవంతుగా కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 73 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు

బొమ్మనహాల్ : మండలంలోని రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో పలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.మండలంలోని కృష్ణాపురం, కొళగానిపల్లి, మైలాపురం, ఉద్దేహాల్, గోనేహాల్, శ్రీధర్‌ఘట్ట, సింగేపల్లి గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో పత్తి, వందెకరాల్లో టమోటా, 50 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బళ్లారి బస్సుల మార్గం మళ్లింపు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణం నుంచి బళ్లారికి వెళ్లే ఆర్టీసీ బస్సులు సోమవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత రాయదుర్గం పట్టణంలోకి రాకుండా శాంతినగర్‌లోని వారపు సంత మైదానం వద్ద ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకూ మాత్రమే ప్రయాణిస్తాయని ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రథోత్సవం పూర్తయ్యాక తిరిగి యథావిధిగా బస్సులు పట్టణంలోకి వస్తాయన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని కోరారు.

పశు నష్టం సంభవిస్తే తెలియజేయాలి

గుమ్మఘట్ట : జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మండలంలో ఎక్కడైనా పశువుల ప్రాణనష్టం జరిగితే సంబంధిత సచివాలయంలోగానీ, పంచాయతీ, తమ కార్యాలయంలోగానీ సమాచారం అందించాలని పశువైద్యాధికారి పి.నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలకు పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వస్తుందన్నారు. కాగా వర్షం కురుస్తున్నప్పుడు పశు, గొర్రెల కాపర్లు మందలను చెట్ల కిందికి కాకుండా అనువైన ప్రదేశాలకు తరలించాలని సూచించారు.

జిల్లాకు చేరిన 1225 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం : మంద్రాస్ ఫర్టిలైజర్ కంపెనీకి చెందిన యూరియా జిల్లాలోని ప్రసన్నాయపల్లి రైల్వే రేఖ్ పాయింటుకు ఆదివారం చేరినట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. జిల్లాకు చేరిన 1225 మెట్రిక్ టన్నుల యూరియాను పరిశీలించామన్నారు. అనంతపురం జిల్లాకు 525 మెట్రిక్ టన్నులు, 700 మెట్రిక్ టన్నులు శ్రీసత్యసాయి జిల్లాకు పంపినట్లు తెలిపారు.

బ్రాహ్మణ భవనం ప్రారంభం

రాయదుర్గం : పట్టణంలోని కోట రాఘవేంద్రస్వామి మఠం ఎదురుగా నిర్మించిన గాయత్రి బ్రాహ్మణ భవనాన్ని సీనియర్ న్యాయవాది బి.అనంత రామాచార్యులు ఆదివారం ప్రారంభించారు. రాయదుర్గం తాలూకా బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు కోడూరి రవీంద్రనాథ్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాయత్రి బ్రాహ్మణ భవనం నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. దీంతోపాటు స్థానికుల విరాళాలతో భవన నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కె.మనోహర్ రాష్ట్ర కమిటీ తరపున రూ.10వేల ఆర్థికసాయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షులు కృష్ణప్రసన్న, రఘునందన్, ప్రధాన కార్యదర్శి జెజి.వెంకటేశాచారి, కోశాధికారి నిప్పాని రంగారావు, సహాయ కార్యదర్శి కరణం రమేష్, ప్రముఖ వైద్యులు ఆత్మకూరు గోపాలరావు, విశ్రాంత తహశీల్దార్ గురుప్రసాద్, న్యాయవాది శ్రీధరఘట్ట నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతిచెందిన తిరుపతినాయుడు

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కోమటికుంట్లకు చెందిన చెరుకూరి తిరుపతినాయుడు (55) శనివారం రాత్రి వ్యవసాయ మోటారు ఆన్‌చేసేందుకు తోటకు వెళ్లాడు. ఇందులో భాగంగా మోటారు వైర్లు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు వైర్ల మీద పడ్డాయి. దీంతో తిరుపతినాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయాన్నే తోటకు వెళ్లిన తిరుపతినాయుడు తమ్ముని కొడుకు పెదనాన్ని చనిపోయి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు తోట వద్దకు వెళ్లి తిరుపతినాయుడు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ మలుపు వద్ద 67వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తొండపాడు గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ (19) తన స్నేహితులు కళ్యాణ్, హరిబాబుతో కలిసి గుత్తికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా గుత్తి నుంచి చెన్నై కి వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రంజిత్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అటెండర్ అదృశ్యం

కళ్యాణదుర్గం : పట్టణంలోని మారంపల్లి కాలనీకి చెందిన పూజారి పవన్‌కుమార్ శనివారం అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పవన్‌కుమార్ స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు వెళ్లిన పవన్ తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో విఆర్ఒ మృతి

కళ్యాణదుర్గం : కంబదూరు మండల కేంద్రానికి చెందిన విఆర్ఒ హొన్నూరుస్వామి (32) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన గత కొన్నేళ్లుగా కంబదూరులో విఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై మంచాన పడ్డారు. దీంతో పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు సహ విఆర్‌ఓలు తెలిపారు.

తాగునీటి కార్మికుల వేతన కష్టాలు

హక్కులు అడిగితే అక్రమ కేసులు.. తొలగింపులు..
ప్రభుత్వ వైఖరిపై కార్మిక సంఘాల ఆగ్రహం
ఉధృత పోరాటానికి కార్మికులు శ్రీకారం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
ప్రజల దాహార్తి తీర్చుతూ వచ్చే వేతనాల్లో కుటుంబాలను పోషించుకునే కార్మికులకు వేతనాల కష్టాలు వెంటాడుతున్నాయి. వేతనాల కోసం ప్రతి నెల రోడ్లు ఎక్కాల్సిన దుస్థితిలో నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు ఎదుర్కొంటున్నారు. సమస్యల పరిష్కారానికి సమ్మెలు, ధర్నాలు, విజ్ఞాపనలు చేయడం, ఉన్నతాధికారులు హామీలతో నెల, రెండు నెలలు వేతనాలు చెల్లించడం సమ్మె విరమింపజేయడం, తరువాత వేతనాలు, పిఎఫ్ సొమ్ము బకాయి పడటం తంతు మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం ద్వారా 650 గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతోంది. 600 మంది కార్మికులు పని చేస్తున్నారు. 14 సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నారు. అతి తక్కువ వేతనాలతో ప్రారంభమైన వారి విధులు ఇప్పటికీ కనీస వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. వేతనాలు పెంపుదల, ఇతర సదుపాయాల కల్పన కోసం పోరాడే పరిస్థితి నుంచి చేసిన పనికి వేతనాలు ఇస్తే చాలన్న దుస్థితికి ప్రభుత్వ పాలకులు కల్పించారు. వేతనాలు అడిగితే సదరు కాంట్రాక్టర్లు తమకు బిల్లులే రాలేందంటూ బదులివ్వడం, అధికారుల చుట్టు కార్మిక సంఘాలు, కార్మికులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అయితే న్యాయమైన హక్కుల కోసం కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధమౌతున్నారు. హక్కుల కోసం ప్రశ్నించే క్రమంలో అక్రమ కేసులు బనాయింపుకు కార్మికులు గురవుతున్నారు. న్యాయం కోసం కేసులు, తొలగింపులకు బెదిరేది లేదని, న్యాయపోరాటం చేయడానికి తాము సిద్ధమంటూ కార్మికులు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.


కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యం



తాము పని చేస్తే కాంట్రాక్టర్‌లకు కమిషన్‌లు పొందుతారు. తమకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా ఇచ్చే వేతనాల్లో కూడా కోతలు విధిస్తున్నారు. కాంట్రాక్టర్ శివ శంకర్‌రెడ్డి కార్మికులకు రావాల్సిన వేతనాల్లో రూ.2 వేలు కోతలు విధించారు. ఇదేమి అడిగితే నానా దుర్భాషలాడుతున్నారు. పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కార్మిక శాఖ అధికారులు పర్యవేక్షణ కరువైంది. మాటి మాటికి కలెక్టర్ స్థాయి అధికారులతో కలవాలంటే సాధ్యం కాదు. ప్రభుత్వం పరిశీలించి తమకు న్యాయం చేయాలి.

రామాంజినేయులు, లైన్‌మెన్

అక్రమ కేసులు పెడుతున్నారు..



తాము చేసిన పనికి వేతనాలు ఇస్తే మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. వేతనాలు ఇవ్వక, చెల్లించాల్సిన పిఎఫ్ కట్టక ఇబ్బందులు పెడుతుంటే హక్కుల కోసం శాంతియుత మార్గంలో నిరసన తెలిపాం. ఆ క్రమంలో అధికారులు తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు.ఎంత మందిపై కేసులు పెట్టారో తెలియదు. కార్మికుల్లో భయాందోళనలు సృష్టిస్తు మా సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. ఉన్నట్టుండి తొలగిస్తే మేము ఎలా బతకాలి. కుటుంబాలు రోడ్డున పడితే మేము బతికి ఏం లాభం, ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి

ఆదిరెడ్డి, లైన్‌మెన్

వేతనాలడిగితే తొలగిస్తామంటున్నారు..



తాము చేసిన పనికి వేతనాలు ఇవ్వమంటే తొలగించేశామంటూ బెదిరిస్తున్నారు. కళ్యాణదుర్గం ప్రాజెక్ట్‌లో ఫిట్టర్‌గా పని చేస్తున్నాను. ఉన్న పలంగా తొలగించామంటూ కాంట్రాక్టర్ శివ శంకర్‌రెడ్డి చెబుతున్నాడు. కాంట్రాక్టర్ వచ్చి 6 నెలలు కావస్తోంది. తాను తరబడి కార్మికుడిగా పని చేస్తున్నాను. నాపై కమిషన్ పొందే కాంట్రాక్టర్ తన్ను తొలగిస్తామనడం అన్యాయం. అందుకే వేతనాలు ఆపిన విధుల్లోకి వెళ్లి పని చేస్తున్నాను. న్యాయ పోరాటంలో న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాం. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

నరేష్, పాపంపల్లి

అన్నకు బదులు పని చేస్తుంటే ఒప్పుకోవడం లేదు



మా అన్న 10 ఏళ్లుగా తాగునీటి కార్మికుడిగా పని చేస్తున్నాడు. పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. తమ్ముడిగా ఆయన స్థానంలో తాను సంవత్సర కాలంగా పని చేస్తున్నాను. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ ఇలా పని చేయడానికి వీల్లేదంటూ మూడు నెలల నుంచి పనికి రానివ్వడం లేదు. మా అన్న చంద్ర అనారోగ్యం సంబంధించి ధృవీకరణ పత్రాలు కూడా సమర్పించాం. మానవత్వం లేకుండా తనను విధుల్లో నుంచి తీసేస్తామంటున్నారు. పరిశీలించి న్యాయం చేయండి

నాగరాజు, లైన్‌మెన్